క్లుప్తంగా

ఈకేవైసీ తప్పనిసరి
మున్సిపల్ చైర్ పర్సన్ అనురాధ


అవగాహన కార్యక్రమంలో చైర్‌పర్సన్, కమిషనర్ తదితరులు

తుర్కయంజాల్ : ఆరోగ్య శ్రీ కార్డుకు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ పేర్కొన్నారు. మంగళవారం రాగన్నగూడలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈకేవైసీ మీ సేవా కేంద్రాల్లో ప్రస్తుతం అందుబాటులో ఉన్నప్పటికీ, ఉచితంగా వార్డు కార్యాలయాల్లో కూడా త్వరలో ప్రారంభించనున్నామని తెలిపారు. ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ సీహెచ్. శ్రీకాంత్, కౌన్సిలర్ మంగమ్మ పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన


నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

తుర్కయంజాల్: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో చర్చించకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తూ కేవలం 5 శాతం మధ్యంతర భృతి ప్రకటించడాన్ని నిరసిస్తూ మంగళవారం తుర్కయంజాల్‌లోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఇ.గాలయ్య, ప్రధానోపాధ్యాయులు కె. భిక్షమయ్య, శంకరయ్య, ఉపాధ్యాయులు కొండల్‌రెడ్డి, శైలజ, రాధిక, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన శక్తి నియోజకవర్గం అధ్యక్షుడిగా నవీన్‌నాయక్


నియామకపత్రం అందుకుంటున్న నవీన్ నాయక్ తదితరులు

మంచాల: గిరిజన శక్తి సంఘం ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అధ్యక్షుడిగా మంచాల మండలం బండలేమూర్‌కు చెందిన పాతులోత్ నవీన్‌నాయక్ ఎన్నికయ్యారు. మంగళవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొర్ర శరత్‌నాయక్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ..గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు నందునాయక్, బసునాయక్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి చేయూత


ఆర్థిక సాయం అందజేస్తున్న డాక్టర్ అఖిల్

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన మాసనోళ్ల ప్రశాంత్ వెన్నెముక సమస్యతో అనారోగ్యానికి గురయ్యాడు. వైద్యులు ఆపరేషన్ చేయాలని చెప్పాడంతో ఆర్థిక సమస్యతో ఇబ్బందులు పడుతున్నాడు. ప్రశాంత్ పరిస్థితిని స్థానికులు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన మంగళవారం యువకుడికి ట్రస్ట్, నిర్వాహక సభ్యులు డాక్టర్ అఖిల్ రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మహేశ్, నరేశ్, అశోక్, వంశీ, ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

గొర్రెలు, మేకలు పంపిణీ చేయాలి


ర్యాలీ నిర్వహిస్తున్న గొర్రెల, మేకల పెంపకందారులు

యాచారం: గొర్రెల, మేకల పెంపకందారులు మండల కేంద్రంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం అర్హులైన పెంపకందారులకు గొర్రెలు పంపిణీ చేయాలని, ప్రతి గ్రామంలో ప్రభుత్వ భూమిని ఇవ్వాలన్నారు. అలాగే, అటవీ ప్రాంతాల్లో గొర్రెలు, మేకలను సాకడానికి అవకాశం కల్పించాలని కోరారు. ప్రత్యేక రుణాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంకరయ్య, జిల్లా గౌరవాధ్యక్షుడు యాదయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం యాచారం మండల కమిటీని ఎన్నుకున్నారు.

అధ్వానంగా సాగర్‌రోడ్డు

- తక్కళ్లపల్లి గేట్ వద్ద ఇరువైపులా దెబ్బతిన్న దిమ్మెలు
- వాహనాలు కాల్వలో పడే ప్రమాదం


తక్కళ్లపల్లి గేట్ బ్రిడ్జి వద్ద శిథిలావస్థకు చేరుకున్న సైడ్ వాల్

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారి డేంజర్ జోన్‌లో ఉంది. ఈ రోడ్డుపై వాహనాల రాకపోకలు ఎక్కువగా సాగిస్తుంటాయి. వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ వ్యవస్థ కూడా తీవ్రంగా మారింది. వాహనాల రాకపోకలతో రోడ్డు అధ్వానంగా తయారయ్యింది. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. యాచారం మండల కేంద్రంలో పీఏసీఎస్ కార్యాలయం నుంచి గాండ్లగూడెం గేట్ వరకు సీసీ రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ గుంతలు వాహనాల డ్రైవర్లకు దగ్గరకు వచ్చే వరకు కనిపించని పరిస్థితి. కొద్ది రోజుల కింద ఓ వీఐపీ తన ఖరీదైన కారులో స్పీడ్‌గా వెళ్తుండగా గాండ్లగూడెం గేట్ వద్ద సీసీ రోడ్డుపై ఏర్పడిన గుంతను చూసిన డ్రైవర్ సడన్‌గా బ్రేక్ వేయడంతో వెనుక నుంచి వెళ్లే మరో వాహనం కారును ఢీకొట్టింది. అదే గుంతలో ఆమనగల్లుకు చెందిన సురేష్ అనే వ్యక్తి మోటార్ సైకిల్‌పై కిందపడిపోయాడు. ఆ సమయంలో ఆ రోడ్డుపై వాహనాలు రాకపోవడంతో ప్రాణాలతో బయటపడ్డారు.

ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో..

సాగర్‌రోడ్డుపై తక్కళ్లపల్లి బ్రిడ్జిపై నుంచి ఏ వాహనం ఎప్పుడు పడిపోతుందో తెలియని పరిస్థితి ఉంది. తక్కళ్లపల్లి గేట్ బ్రిడ్జి వద్ద రోడ్డుకు ఇరువైపులా కృష్ణాజలాల పైపులైన్లు ఉన్నాయి. పైపులైన్లు రోడ్డుకు మధ్యలో దిమ్మెలు ఉన్నాయి. ఈ దిమ్మెలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరాయి. కొన్నాళ్ల కింద ఇరువైపులా ఉన్న దిమ్మెలకు వాహనాలు ఢీకొని దెబ్బతిన్నాయి. ప్రయాణికులు పలుమార్లు దిమ్మెల శిథిలావస్థపై రోడ్డు భవనాల శాఖ అధికారులకు ఫిర్యాదులు కూడా చేశారు. రెండు వైపులా పైపులైన్లు ఉండడంతో ఇక్కడ రోడ్డు వెడల్పు కూడా తక్కువగా ఉంది. ఒకేసారి పెద్ద వాహనాలు రాకపోకలు సాగించాలంటే ఢీకొనే పరిస్థితి ఉంది. వాహనాలు కాల్వలో పడే అవకాశం లేకపోలేదు. కాల్వలో పడి ప్రయాణికులు ప్రాణాలు పోగొట్టుకునే లోపు మరమ్మతులు చేస్తే బాగుంటుందని ప్రయాణికులు కోరుతున్నారు.

పట్టించుకోవడం లేదు



తక్కళ్లపల్లి గేట్ వద్ద రోడ్డుకు ఇరువైపులా ఉన్న దిమ్మెలు పూర్తిగా దెబ్బ తిని శిథిలాసవ్థకు చేరాయి. పలుమార్లు రోడ్డు భవనాల శాఖ అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందన లేదు. వాహనాలు కాల్వలో పడి ప్రయాణికులు ప్రాణాలు కోల్పోతే గాని అధికారుల్లో చలనం రాదు.

– దెంది రాంరెడ్డి, తమ్మలోనిగూడ

అభివృద్ధి, సంక్షేమమే గెలిపిస్తుంది

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి


బీఆర్ఎస్‌లో చేరుతున్న వివిధ పార్టీల కార్యకర్తలు

యాచారం: నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి , సంక్షేమమే తనను నాలుగోసారి గెలిపిస్తుందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కేసీతండాకు చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేసిన అభివృద్ధి, సంక్షేమంపై బీఆర్ఎస్ శ్రేణులు ఇంటింటికి వెళ్లి విస్తృత ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. చేసిన పనులు చెప్పుకోలేకపోతే నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి భాషా, ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నేనావత్ శంకర్‌నాయక్, పార్టీ సీనియర్ నాయకుడు యాదయ్యగౌడ్ పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన కార్మికులు


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కిషన్

తుర్కయంజాల్: మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్, కనీస వేతనం తదితర సిబ్బందిని పర్మినెంట్ చేయడంతో పాటు, రూ. 21వేల కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి తుర్కయంజాల్ నుంచి మున్సిపల్ కార్మికులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి డి. కిషన్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు ఎం. సత్యనారాయణ, ఎన్. యాదగిరి,ఎస్. నగేష్, మురళి, రంగయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐదుశాతం ఐఆర్ ఇవ్వడం ఏమిటి?

పీఆర్టీయూ మండల అధ్యక్షుడు పరమేశ్


వినతిపత్రం అందజేస్తున్న అర్జున్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎంతో ఆశగా ఎదురు చూస్తుంటే వేతన సవరణ జరిగేలోపే ఇచ్చే ఐఆర్ ఐదు శాతం ప్రకటించడం సమంజసం కాదని పీఆర్టీయూ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు వర్కాల పరమేష్ పేర్కొన్నారు. మంగళవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించిన పీఆర్సీ, అరియర్స్, డీఏల విషయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆర్థికంగా నష్టపోయారన్నారు. ఆ కొరతను కనీసం 20–25 శాతం ఐఆర్‌తో తీరుస్తుందని భావించిన ఉద్యోగులకు ప్రభుత్వం ప్రకటించిన 5 శాతం ఐఆర్‌తో అవాక్కయ్యామని తెలిపారు. ప్రభుత్వం పునరాలోచించాలని, లేకుంటే ఎన్నికల్లో ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు .

● పారదర్శకంగా ఉపాధ్యాయ బదిలీలు

ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్లు పారదర్శకంగా చేపట్టాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అర్జున్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం జిల్లా విద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అర్జున్‌రెడ్డి మాట్లాడుతూ.. జీఓ 317 ప్రకారం జిల్లాలో17 మండలాల క్యాడర్ స్ట్రెంత్ ఎంత, మహబూబ్‌నగర్ నుంచి కలిసిన 10 మండలాల క్యాడర్ స్ట్రెంత్ ఎంత అని ప్రశ్నించారు . జిల్లాల నుంచి పైరవీల ద్వారా అడ్డదారుల్లో ప్రమోషన్లు పొంది, బదిలీపై జిల్లాలో ప్రవేశించారని తెలిపారు. నకిలీ ధ్రువీకరణ పత్రాలు సమర్పించిన వారిపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. పారదర్శకంగా బదిలీలు, ప్రమోషన్లు చేపట్టకపోతే తగిన పరిణామాలు ఎదుర్కొక తప్పదని హెచ్చరించారు.

మండల అభివృద్ధికి నిరంతరం కృషి

జెడ్పీటీసీ దశరథ్‌నాయక్


ప్రొసీడింగ్ కాపీని అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

కడ్తాల్: మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ పేర్కొన్నారు. మండలంలో సీసీరోడ్ల నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణంతో పాటు, వివిధ అభివృద్ధి పనులకు, జిల్లా పరిషత్ నుంచి నిధులు మంజూరు చేయాలని, జెడ్పీ చైర్ పర్సన్ అనితారెడ్డిని కోరామన్నారు. మంగళవారం మండలంలో అభివృద్ధి పనులకు, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి రూ.25 లక్షల ప్రొసీడింగ్‌ను అందజేసిందని చెప్పారు. ఈ సందర్భంగా దశరథ్‌నాయక్ మాట్లాడుతూ.. జెడ్పీటీసీగా ఎన్నికైనప్పటి నుంచి జిల్లా పరిషత్ నుంచి పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయించి, మండల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేసినట్లు పేర్కొన్నారు. మండల పరిధిలోని గ్రామాల్లో, తండాల్లో అక్కడక్కడ మిగిలి ఉన్న సీసీ రోడ్ల నిర్మాణం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణానికి నిధులు అవసరం ఉండటంతో, ఇటీవలే జెడ్పీ చైర్ పర్సన్‌ను కలిసి సమస్యలు వివరించడంతో పాటు, నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు.

మధ్యాహ్న భోజన కార్మికుల భిక్షాటన


ఇబ్రహీంపట్నం: భిక్షాటన చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ఇబ్రహీంపట్నం: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు స్వప్న, సీఐటీయూ మండల కన్వీనర్ బుగ్గరాములు డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా మంగళవారం ఇబ్రహీంపట్నంలో కార్మికులు భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వంట బిల్లులు చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. పెంచిన రెండు వేల పారితోషికాన్ని రెండేళ్లు కావస్తున్నా అమలు చేయడం లేదని వాపోయారు. యూనిఫాం, కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని కోరారు. నేడు (బుధవారం) ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట చేయనున్న ధర్నాకు పెద్ద సంఖ్యలో మధ్యాహ్న భోజన కార్మికులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

● మోకాళ్లపై నిలబడి నిరసన

తమ సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా నాయకురాళ్ళు బేబి, గీత బాలమణి అన్నారు. సమ్మెలో భాగంగా మంగళవారం ఇబ్రహీంపట్నంలో మోకాళ్లపై నిలబడి అంగన్‌వాడీలు తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 23 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వ నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. కనీస వేతనం రూ.26 వేలు ఇచ్చి పీఎఫ్, ఈఎస్ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. తక్షణమే సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో ఇందిరా పార్కు వద్ద ధర్నా కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు అహల్య, శోభ,వనజ, సువర్ణ, లక్ష్మీ, అండాలు, పెంటమ్మ, యాదమ్మ, మారమ్మ, లక్ష్మమ్మలు పాల్గొన్నారు.

● కొనసాగుతున్న సమ్మె

ఆమనగల్లు: తమ సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన వేర్వేరు దీక్షా శిబిరాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మె చేపట్టారు. సమ్మెకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జగన్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికులు తమ జీవితాలను పణంగా పెట్టి కట్టెల పొయ్యిపై వంటచేసి విద్యార్థులకు పెడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు ఈశ్వరమ్మ, లలిత, కవిత, అలివేలు, శంకరమ్మ, గోజి, యాదమ్మ, బీమమ్మ పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే హామీల అమలు


మంచాల: ఇంటింటికీ తిరిగి ప్రచారం చేస్తున్న నాయకులు


యాచారం: కాంగ్రెస్‌లో చేరుతున్న వివిధ పార్టీల శ్రేణులు

మంచాల: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేస్తామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గుండమోని జయమ్మ పేర్కొన్నారు. మంగళవారం మంచాల మండలంలోని జాపాలలో పార్టీ నేత దశరథ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ ఎన్నికల హామీలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అవినీతి, అక్రమాలకు కేరాఫ్ అడ్రాస్‌గా బీఆర్ఎస్ పార్టీ మారిందన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ సక్రమంగా అమలు చేయలేదని విమర్శించారు. సంక్షేమం పేరుతో పెద్ద ఎత్తున ప్రజాధనం దుర్వినియోగానికి పాల్పడుతోందని ఆరోపించారు.సామాన్య ప్రజలకు ఒరిగిందేమిని లేదన్నారు. దళిత బంధు, బీసీ బంధు, గృహలక్ష్మి వంటి పథకాలు, కార్పొరేషన్ రుణాలు వంటివి నిజమైన అర్హులకు అందించకుండా బీఆర్ఎస్ నాయకులే మింగేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు సంజీవ, సంతోష్‌కుమార్, హన్మంత్‌రెడ్డి, ప్రేమాకర్‌రెడ్డి, శ్రీధర్, మల్లేష్, సత్తయ్య, దాసు, ఉపేందర్‌రెడ్డి, సుమన్, అజ్గర్, మహిళ విభాగం మండల అధ్యక్షురాలు శిల్పా పాల్గొన్నారు.

● గడపగడపకూ 'గ్యారంటీ' స్కీములు

తుర్కయంజాల్: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ స్కీములను పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. తుర్కయంజాల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో, మున్సిపాలిటీ అధ్యక్షురాలు, కౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ.. బుధవారం నుంచి గడపగడపకూ తిరుగుతూ పథకాలను వివరించాలని సూచించారు. అనంతరం 24 వార్డులకు పార్టీ అధ్యక్షులను, బూత్ కమిటీలను నియమించారు. కార్యక్రమంలో కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ ఐలయ్య, కౌన్సిలర్లు సునీల్, వర్కింగ్ ప్రెసిడెంట్ దర్శన్, పీసీసీ సభ్యులు కొత్తకుర్మ శివకుమార్ పాల్గొన్నారు.

● కాంగ్రెస్‌లో పలువురి చేరిక

యాచారం: ప్రజల్లో మార్పు కనిపిస్తోందని, స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరుతున్నారని మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చింతపట్ల గ్రామానికి చెందిన పలు పార్టీల నాయకులు మంగళవారం మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు దఫాలుగా కేసీఆర్ సర్కార్ చేస్తున్న మోసాలు, అక్రమాలపై ప్రజల్లో చైతన్యం , అవగాహన వచ్చిందన్నారు. అందుకే ప్రజలు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు శ్రీనువాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మస్కు నర్సింహ, నాయకులు లిక్కి శ్రీనువాస్‌రెడ్డి, లిక్కి సుధాకర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, అమృతాసాగర్, కేసరీ సాగర్, పాండురంగారెడ్డి, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

● ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని వినతి

కడ్తాల్: మండల కేంద్రంలో ఇళ్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించి, డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, యువజన కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ ముంతాజ్‌ను కలిసి, వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల కేంద్రంలో ఇళ్ల స్థలాలు లేక నిరుపేదలు అనేక గోసలు పడుతున్నారని, వేలవేలకు అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. గ్రామ సమీపంలో సర్వే నంబర్ 644లో 3.03 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఆ భూమిలో ప్లాట్స్ ఏర్పాటు చేసి, ఇళ్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. లేని పక్షంలో పేదల పక్షాన కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు భానుకిరణ్, జిల్లా నాయకులు అజ్గర్‌అలీ, క్యామ రాజేశ్, రాజేందర్‌గౌడ్, శ్రీకాంత్, ప్రవీణ్, చందు, రామకృష్ణ, విజయ్‌రాథోడ్ తదితరులు ఉన్నారు.

లఖింపూర్ దోషులపై చర్యలేవి?


యాచారం: భారీ ర్యాలీలో పాల్గొన్న మధుసూదన్‌రెడ్డి తదితరులు

ఇబ్రహీంపట్నం: కేంద్ర ప్రభుత్వం లఖింపూర్ కేరి ఘటన బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ, రైతు, సీఐటీయూ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఇబ్రహీంపట్నంలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. 2021లో లఖింపూర్‌లో శాంతియుతంగా నల్ల చట్టాలపై నిరసన వ్యక్తం చేస్తున్న రైతుల మీదికి కేంద్ర మంత్రి కుమారుడు కాన్వాయ్ దూసుకెళ్లడంతో 9 మంది రైతులు ప్రాణాలు కోల్పోయారు. కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. దోషులపై చర్యలు తీసుకోకుంటే దేశవ్యాప్త ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు జంగయ్య, ముసలయ్య, గణేశ్,రాములు, నర్సింహ్మ, అశోక్, బాల్‌రాజ్‌లు పాల్గొన్నారు.

● కార్పొరేట్ సంస్థలకు దాసోహం

యాచారం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవసాయ చట్టాలను కాలరాస్తు, కార్పొరేట్ సంస్థలకు దాసోహంగా మారిందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి. మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. లాఖింపూర్ ఖేరి ఘటనను నిరసిస్తూ మంగళవారం రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... కేంద్రం వ్యవసాయ చట్టాలను పూర్తిగా రద్దు చేసి రైతాంగాన్ని దిక్కుతోచని స్థితిలోకి వెళ్లేలా కుట్రలు చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్


ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఆమనగల్లు: ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. నియోజకవర్గంలో 37 పల్లె, బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని కోనాపూర్‌లో మంగళవారం మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్జున్‌రావు ఆధ్వర్యంలో ఆయుష్ చక్ర సంచార వైద్యశాలలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. పేదలకు సంచార వైద్యశాలతో వైద్యం అందించడంపై అర్జున్‌రావు, డా.సునీతలను ఎమ్మెల్యే అభినందించారు. అంతకుముందు జరిగిన సభలో జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఒక మహోన్నత శక్తి అని అన్నారు. దేశంలో ఏరాష్ట్రంలో లేనివిధంగా సంక్షేమం పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. కేసీఆర్ సహకారంతో కల్వకుర్తి అసెంబ్లీ నియోజక వర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. పల్లె, బస్తీ దవాఖానాల కోసం రూ.20 లక్షలతో ఒక్కో భవనం నిర్మిస్తున్నామని తెలిపారు. ఆమనగల్లు పట్టణంలో నూతనంగా 50 పడకల ఆస్పత్రిని మంజూరు చేయించి రూ.17.50 కోట్లతో నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. కడ్తాల్‌లో 30 పడకల ఆస్పత్రి ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఆయన వివరించారు. అలాగే కల్వకుర్తికి 77 వేల బతుకమ్మ చీరలు వచ్చినట్లు ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో కోనాపూర్ సర్పంచ్ మల్లమ్మ, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్, వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నారాయణ, ఎంపీటీసీ కుమార్, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ బాల్‌రాం తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల అభిప్రాయం మేరకే టికెట్


కార్యకర్తల సమావేశంలో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజక వర్గం కాంగ్రెస్ టికెట్‌ను అధిష్టానం అభిప్రాయం మేరకు కేటాయించాలని పలువురు కాంగ్రెస్ నాయకులు కోరారు. మాడుగుల మండల కేంద్రంలో మంగళవారం ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలువురు మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ ఓటమి అనంతరం కాంగ్రెస్ శ్రేణులు డీలా పడ్డాయని అన్నారు. ఎప్పుడైతే ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారో అప్పటినుంచి కాంగ్రెస్‌లో నూతనోత్సాహం వచ్చిందని అభిప్రాయపడ్డారు. కల్వకుర్తిలో కాంగ్రెస్ టికెట్ ఎవరికి ఇస్తే విజయం సాధిస్తారో సర్వే నిర్వహించాలని, కార్యకర్తల అభిప్రాయం సేకరించాలని అన్నారు. అకస్మాత్తుగా పార్టీలోకి వచ్చేవారికి టికెట్ ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. అధిష్టానం సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డికి టికెట్ కేటాయిస్తే కల్వకుర్తిలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని పలువురు అన్నారు.